# జ్ఞానోదయం

డా. కె. పద్మలత

‘‘కంగ్రాచ్యులేషన్స్ ఆదిత్యా!’’ బి.టెక్. ఫస్ట్‌క్లాసులో పాసయ్యానని తెలిసి నాన్నగారు సంతోషంగా అభినందిస్తుంటే గర్వంగా ఫీలయ్యాను.

‘‘థాంక్యూ నాన్నా!’’ అన్నాను.

‘‘ఫ్యూచర్ ప్లానేంటీ’’ అన్నారు సోఫాలో కూర్చుంటూ.

‘‘ఏముంది, ఏవైనా మంచి కంపెనీస్‌లో జాబ్‌కి అప్లయ్ చేయడం, వస్తే జాయిన్ కావడం, అంతే’’ అన్నాను.


‘‘అదేంటీ! నీ ఇంజనీరింగ్ కోర్సు పూర్తికాగానే స్టేట్స్‌కి రమ్మని అన్నయ్య ముందునుండి చెప్తూనే ఉన్నాడు కదా! నువ్విక్కడ జాబ్ వెతుక్కోవడం ఎందుకు?’’ అన్నారు ఆశ్చర్యంగా.

మా అన్నయ్య నాలుగు సంవత్సరాల క్రితం కంప్యూటర్ ఇంజనీరింగ్ చేసి, పెళ్ళి చేసుకొని, వాళ్ళ మామగారి సహాయంతో స్టేట్స్‌కి వెళ్ళి అక్కడే సెటిల్ అయిపోయాడు. ఈ నాలుగేళ్ళలో రెండుసార్లు వచ్చి వెళ్ళాడు. ఇంజనీరింగ్ కాగానే పాస్‌పోర్ట్ సంపాదించుకొమ్మని, ఫార్మాలిటీస్ కంప్లీట్ చేసి అమెరికా వెళ్ళడానికి వాళ్ళ మామగారు సహాయపడుతారని అన్నయ్య క్రితంసారి వచ్చినప్పుడే చెప్పాడు. అప్పుడు నేనేమి మాట్లాడలేదు. కాని, నా మనసులో స్టేట్స్‌కి వెళ్ళడమంటే ఏదో విముఖత. అందుకే నాన్నగారు అడగగానే ‘‘నాకు స్టేట్స్‌కు వెళ్ళడం ఇష్టంలేదు. ఇక్కడే ఏదైనా జాబ్ చూసుకుంటాను’’ అన్నాను.

నాన్నగారు విచిత్రంగా చూసి, ‘‘ఆదిత్యా! నువ్వు చిన్నపిల్లాడవి కాదు. నీ భవిష్యత్తు గురించి నిర్ణయించుకోవలసింది నువ్వే. నిన్ను బలవంతంగా పంపించలేనని నాకు తెలుసు. అది నాకు ఇష్టంలేదు కూడా. కాని, కనీసం రెండు సంవత్సరాలు అక్కడ ఉండి ఎమ్మెస్ పూర్తి చేసుకోవడం మంచిదని నా అభిప్రాయం. నీ ఇష్టం. ఆలోచించుకో’’ అని ‘‘అయినా, ఎందుకు వెళ్ళనంటున్నావో తెలుసుకోవచ్చా?’’ అన్నారు.

‘‘ఇంజనీర్లు, డాక్టర్లు, టెక్నీషియన్స్ అందరూ స్టేట్స్‌కి వలసపోతే మనదేశం సంగతి ఏంటి నాన్నా! నామటుకు నాకు ఆర్థికంగా లాభం లేకపోయినాసరే, నాదేశంలోనే ఏదో ఒక జాబ్ చేసి దేశం అభివృద్ధిలో నావంతు ప్రయత్నం చేసానన్న సంతృప్తితో ఉండాలని ఉంది’’ అన్నాను ఎమోషనల్‌గా.

నాన్నగారు నవ్వి, ‘‘ఓకే, నీకంత ఆదర్శవంతమైన అభిప్రాయాలున్నప్పుడు నేను వాటిని మార్చదలుచుకోలేదు. కాని, శేషగిరి



## హావభావాలను ప్రకటించే రోబోలు




జపాన్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ సంస్థ కన్సల్‌టెంట్ అసోసియేషన్ ఇన్ కార్పొరేట్ ఎన్నో ఉన్నతమైన సాంకేతిక పరిమాణాలతో ముందుకు దూసుకువచ్చింది. ఇంతవరకూ మనం రోబోట్లు పని చేయడంవరకే చూశాంకానీ ఇప్పుడు ఈ సంస్థ రూపొందించిన రోబోలు అచ్చం మనుష్యుల్లాగే హావభావాలను ప్రదర్శిస్తాయి, మాట్లాడతాయి. మాటలకు తగినట్టుగా హావభావాలను ప్రదర్శిస్తాయి. ఈ సంస్థకు చెందిన ప్రఖ్యాత సాంకేతిక నిపుణుడు, రోబోల నిర్మాణ కర్త ఎస్.డాల్ ఇలాంటి రోబోను రూపొందించాడు. ఈ రోబో కంపెనీలో పని చేసే ఉద్యోగులతో మాట్లాడుతుంది. రకరకాల పనులు చేస్తుంది.

-ఎ.పండరినాథ్

## డబ్బుంటే ఎంత సుఖం!

అంతరిక్షానికి వెళ్లడానికి అప్పట్లో రష్యా వాళ్ళు చాలా కష్టపడ్డారుగానీ ఇప్పుడు అంతరిక్షానికి వెళ్లాలంటే డబ్బుంటే చాలు. మార్క్ షెటిల్ అనే అతను కొన్ని మిలియన్ డాలర్లు ఖర్చు పెట్టి హాయిగా అంతరిక్షంలోకి వెళ్లి ఎంజాయ్ చేసి వచ్చాడట. చూశారా! డబ్బుంటే ఎంత సుఖమో! సో... మీలో ఎవరికైనా అంతరిక్షానికి వెళ్లాలని ఉంటే సుమారు 25 మిలియన్ డాలర్లు ఖర్చు పెట్టగలిగితే మీరూ అంతరిక్షానికి వెళ్లి రావచ్చు.

- ప్రియ




రావు ప్రపోజల్ నీకు చెప్తున్నాను విను. వాళ్ళమ్మాయి స్ఫూర్తిని నీకిచ్చి పెళ్ళి చేయాలని ఆయన ఉద్దేశం. ఇప్పుడే కాదులే. మరో రెండు సంవత్సరాల తర్వాత. అయితే ఈలోగా నువ్వు స్టేట్స్‌కు వెళ్ళి ఎమ్మెస్ పూర్తి చేసి ఏదైనా జాబ్ చూసుకోవడం మంచిదని ఆయన ఒపీనియన్. అక్కడ ఆయనకు తెలిసినవాళ్ళు చాలా మంది ఉన్నారు. అన్నయ్య కూడా ఉన్నాడు. అందుకే నీకు వాళ్ళంతా హెల్ప్ చేస్తారు కనుక పెద్ద ప్రాబ్లమేమీ ఉండదనుకున్నాం. ఇది కేవలం ఆయన ప్రపోజల్ మాత్రమే. దాన్ని నువ్వు ఖచ్చితంగా ఒప్పుకోవాలని ఏంలేదు. బాగా ఆలోచించుకో.'' అన్నారు. నేను మౌనంగా తల ఊపి బయటికొచ్చాను.

శేషగిరిరావు అంకుల్ మా వదినకు చిన్నాన్న. వాళ్ళమ్మాయి మొన్ననే ఎం.సి.ఎ.లో జాయిన్ అయింది. చాలా అందమైనది, తెలివైనది. నాకు ఆ అమ్మాయంటే ఇష్టమే. కాని, స్టేట్స్‌కి వెళ్తేనే వాళ్ళమ్మాయిని నాకిచ్చి పెళ్ళిచేయాలని గనుక ఆయన అనుకుంటే, నేను ఆ అమ్మాయిని వదులుకోవడానికి కూడా సిద్ధంగానే ఉన్నాను. ఎందుకంటే, నేను భవిష్యత్తులో నాదేశంలోనే స్థిరపడాలని నిశ్చయించుకున్నాను.

అసలు నాలో ఈ అభిప్రాయాలు చోటుచేసుకోవడానికి ముఖ్యకారకులు మా ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ గారే. ఆయనకు సబ్జెక్టుపరంగానే కాక ఆర్థిక, సామాజిక విషయాలపై మంచి అవగాహన ఉంది. ఈ నాలుగు సంవత్సరాలలో నేను ఆయనకు ప్రియశిష్యుడనైపోయాను. ఆయన మంచి వక్త. సామాజికవేత్త కూడా. ఎన్నో బహిరంగ సభలలోను, చర్చలు, గోష్ఠులలోను ఆయన పాల్గొంటారు. ఆయన ఉపన్యాసం వింటూ ఉంటే ఒక అద్భుతమైన అనుభూతి కలుగుతుంది. ఆయన మాటలు మనసుకు పట్టేస్తాయి. ఆయన ప్రభావం ఈ నాలుగు సంవత్సరాలలో నాపై బాగా పడింది. ఆయన 'వలసవాదాన్ని, స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని, ప్రైవేటీకరణను' తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఇవన్నీ అమెరికా, బ్రిటన్ వంటి సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను తమ గుప్పిట్లో ఉంచుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగమేనని ఆయన ఆవేశంగా అంటారు. 'మేధోవలస'ను కూడా ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తారు. చదువుకున్నవారు, మేధావులు అందరూ అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు వలసపోవడం ద్వారా ఆ దేశాల అభివృద్ధి మరింత పెరుగుతుందని, కాని, మనదేశం వంటి దేశాలు ఇట్లాంటి వలసల వలన మేధావులు, టెక్నీషియన్ల సేవలను పొందలేక, తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోలేక వెనుకబడి ఉంటాయన్న ఆయన అభిప్రాయం నాలో గాఢంగా ముద్రవేసుకుంది.

ఈమధ్య ఫైనల్ ఎగ్జామినేషన్ కంప్లీట్ అయిన తర్వాత ప్రొఫెసర్ గారిని కలిసినప్పుడు కూడా నేను విదేశాలకు వెళ్ళదలుచుకోలేదని, ఇక్కడే ఉండాలనుకుంటున్నానని చెప్పినప్పుడు ఆయన నా భుజం తట్టి అభినందించారు. ''నీలాంటివాడు నా శిష్యుడైనందుకు నాకు చాలా గర్వంగా ఉందోయ్'' అన్నారు. అప్పుడు నేను చాలా హ్యాపీగా ఫీలయ్యాను కూడా.

ఆలోచనా స్రవంతిలో కొట్టుకొనిపోతూ నడుస్తున్న నాకు ప్రక్కనుండి స్కూటర్ హారన్ వినిపించింది. నా ఫ్రెండ్ నిర్మల్ ''ఏరా, అంత పరధ్యానంగా ఎక్కడికి నడుచుకుంటూ వెళ్తున్నావ్. నీ బైక్ ఏమయింది?'' అని అడిగాడు.

నేను నవ్వి ''ఊరికే ఏమీ తోచక బయటికొచ్చాను. అయినా ఇప్పుడు నువ్వు కలిసావ్ కదా. ఇద్దరం కలిసి ఏదైనా రెస్టారెంట్‌కెళ్ళి కాఫీ త్రాగి ఆ తర్వాత ప్రొఫెసర్ గారింటికి వెళ్దాం. నీకు వేరే పని లేకపోతేనే.'' అన్నాను.

''సరే, స్కూటర్‌పై కూర్చో'' అని రెస్టారెంట్‌వైపు పోనిచ్చాడు. కాఫీకి ఆర్డరిచ్చి కూర్చున్న తర్వాత.. ''ఆ.. ఇప్పుడు చెప్పు. ఏ విషయం గురించి అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్'' అన్నాడు.

నిర్మల్ చిన్నప్పటి నుండి నాకు మంచి ఫ్రెండ్. అతని దగ్గర నాకు దాపరికాలేవీ లేవు. అందుకే ఈరోజు నాన్నగారికి, నాకు మధ్య జరిగిన సంభాషణను అతనికి చెప్పాను. అంతా విని అతడు ''నాకు మాత్రం మీనాన్నగారి ప్రపోజల్ మంచిదనిపిస్తుంది'' అన్నాడు.

''అదేంటీ, మనకు ప్రొఫెసర్‌గారు ఎన్ని విషయాలు చెప్పారు. అవన్నీ విన్నతర్వాత కూడా నా నిర్ణయం తప్పని ఎలా అనగలుగుతున్నావ్. అయినా, నువ్వు కూడా ఇక్కడే ఉంటున్నావ్ కదా.'' అన్నాను.

''ఆదిత్యా! నేను మధ్య తరగతికి చెందినవాడిని. నన్ను ఇంజనీరింగ్ చదివించడానికి అమ్మా, నాన్న చాలా కష్టపడ్డారు. ఇప్పుడు నన్ను విదేశాలకు పంపే స్థోమత వారికి లేదు. అందుకే నేను ఇక్కడే ఏదైనా మంచి కంపెనీలో, వీలైతే మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం చూసుకొని, కొంచెం సెటిల్ అయిన తర్వాత ఎప్పటికైనా ఫారిన్ వెళ్ళాలన్నది నా కోరిక. కాని, నీకలా కాదు, మీ నాన్నగారు, కాబోయే మామగారు ఎవరైనా నిన్ను స్టేట్స్‌కి పంపగల స్థితిలో ఉన్నారు. ఇక ప్రొఫెసర్ గారి మాటలంటావా, అవి వినడానికి బాగుంటాయి కాని, ఆచరించడానికి కుదరదు'' అన్నాడు.

''ఛ.. నువ్వెప్పుడూ ఇంతే!'' అన్నాను విసుగ్గా.

నిర్మల్ నా ముఖంలోకి పరీక్షగా చూసి, ''ఆయనంటే నీకు చాలా గౌరవమని నాకు తెలుసు. అయినా ఒక ప్రశ్న అడుగుతాను. జవాబు చెప్పు. ఇంతగా బ్రెయిన్‌డ్రెయిన్ గురించి, మేధోవలస గురించి విమర్శించే ఆయన తన కొడుకును, కూతుర్ని ఫారిన్ కంట్రీస్‌కి ఎందుకు పంపాడంటావ్?'' అని అడిగాడు.

''ఆ విషయం గురించి ప్రొఫెసర్‌గారు నాతో చెప్పి ఎప్పుడూ బాధపడతారు. ఆయన పిల్లలకు ఆయన అభిప్రాయాలు ఛాదస్తంగా అనిపించాయి. అందుకే

మూడు సంవత్సరాల క్రితం ఆయన కొడుకు తండ్రికి ఇష్టం లేకపోయినా స్విట్జర్లాండ్ వెళ్ళాడు. అదేవిధంగా లాస్ట్‌ఇయర్ ఆయన కూతురు కూడా ఫారిన్ సంబంధ మయితేనే చేసుకుంటానని పోట్లాడి అమెరికాలో ఉంటున్న ఒక డాక్టర్‌ని పెళ్ళిచేసుకొని వెళ్ళిపోయింది. ఆరోజు మాష్టారు ఏడ్చినంత పని చేశారు. తన సిద్ధాంతాలను తన పిల్లలే ఆచరించలేకపోయారని ఎంతో కుమిలిపోయారు.'' అన్నాను.

నిర్మల్ నవ్వి ''నువ్వు అమాయకుడివో, పిచ్చివాడివో నాకర్థంకాదు. అవన్నీ విద్యార్థుల దృష్టిలో, సమాజం దృష్టిలో వాళ్ళు ఆదర్శవాదులుగా నిలిచిపోయేందుకు చేసే ప్రయత్నాలు మాత్రమే అని నీకు నేనెలా చెప్పాలి.'' అన్నాడు.

''సరే, నీ అభిప్రాయాలు, నా అభిప్రాయాలు కలవవుగాని ప్రొఫెసర్ గారింటికి వెళదాంపద. రిజల్ట్స్ గురించి చెప్పినట్టు ఉంటుంది.'' అన్నాను.

ప్రొఫెసర్ గారింటికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. పవర్ లేదేమో బెల్ మోగినట్టులేదు. తలుపు తోయగానే తెరుచుకుంది. ఫ్రంట్ రూంలోకి వెళ్ళి కూర్చున్నాం. తరుచుగా వస్తాను గనుక నాకిది అలవాటే. లోపల హాల్లో నుండి మాటలు వినిపిస్తున్నాయి. ''అయితే బావా! సుశీల్‌ను స్విట్జర్లాండ్‌లోనే ఉంచుతావా. కొన్నాళ్ళు ఉండి ఇండియా వచ్చేయమంటావా?'' అని అడుగుతున్నారు బహుశా ప్రొఫెసర్‌గారి బావమరిదేమో.

''ఇండియాలో ఏముంది రావడానికి. వాడిని స్విట్జర్లాండ్ నుండి అమెరికా వెళ్ళడానికి ప్రయత్నం చేసుకొమ్మని చెప్తున్నాను. అక్కడయితే అమ్మాయి, అబ్బాయి ఒకేచోట, మంచి డెవలప్డ్ కంట్రీలో ఉన్నట్టు ఉంటుంది. అప్పుడప్పుడు నేను కూడా ఏవో సెమినార్లు, కాన్ఫరెన్స్‌లకు అప్లయ్ చేసుకొని వెళ్ళి ఆ మిషతో పిల్లలను చూసిరావచ్చు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు'' అంటూ ప్రొఫెసర్‌గారు నవ్వడం వినిపించింది. నాకాళ్ళ క్రింద భూమి కదులుతున్నట్టుగా ఉంది. కళ్ళు తిరుగుతున్నాయ్. నిర్మల్ భుజం పట్టుకున్నాను. అతడు ''ప్లీజ్ ఆదిత్యా! రిలాక్స్-'' అన్నాడు.

''అదేంటి బావా! నీకు భారతదేశమంటే ఇష్టం. విదేశాలకు వెళ్ళడాన్ని వ్యతిరేకిస్తావ్ కదా.'' మళ్ళీ అతని బావమరిది గొంతు.

''దేశమంటే ఇష్టమే. కాని, ఏం లాభం. ఇక్కడుంటే డబ్బులేమొస్తాయ్. అక్కడయితే బోలెడు సంపాదించుకోవచ్చు. అయినా, నా సిద్ధాంతాలు నా పిల్లల భవిష్యత్తును దెబ్బతీయడం నాకిష్టంలేదు. అవి విద్యార్థులకు చెప్తాం. విన్నవాళ్ళు వింటారు. లేకపోతే లేదు. అవన్నీ పాటిస్తూపోతే మిగిలేది చిప్పే'' మళ్ళీ ప్రొఫెసర్‌గారి నవ్వు. నేను ఆవేశంగా లేచి లోపలికి వెళ్ళబోయాను. కాని నిర్మల్ నన్ను బలవంతంగా బయటకు లాక్కొచ్చాడు.

''ఆదిత్యా! ఇవన్నీ నేను ఊహించే నీకు చెప్పాను. కాని, నువ్వే అనవసరమైన భ్రమలు కల్పించుకొని, అవన్నీ అబద్ధం అని తెలిసిన తర్వాత ఇప్పుడు బాధపడితే లాభమేంటి. అయినా మనకంటూ కొన్ని స్వంత అభిప్రాయాలుండడం చాలా అవసరం. మాష్టారు చెప్పారనో, నాన్నగారు చెప్పారనో కాకుండా నీకు నువ్వుగా ఆలోచించుకొని భవిష్యత్తును నిర్ణయించుకో. పద.. ఇంటి దగ్గర దించుతాను'' అని బయల్దేరదీసాడు. నిర్మల్ నన్ను ఇంటి దగ్గర దించి వెళ్ళిపోయాడు. లోపలికి అడుగుపెట్టిన నేను నాన్నగారు ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుంటే, మధ్యలో నాపేరు కూడా వినిపించడంతో అక్కడే ఆగిపోయాను. నాన్నగారు నన్ను చూడలేదు. ఆయన అటు తిరిగి కూర్చున్నారు.

''అది నిజమేగాని శేషగిరి, అబ్బాయికి స్టేట్స్ వెళ్ళడానికి అంత ఇంటరెస్ట్ లేదోయ్. ఇక్కడే జాబ్ చేస్తానంటున్నాడు. నిజానికి వాడిని పంపడం నాకూ పెద్దగా ఇష్టంలేదు. కాకపోతే అక్కడికి వెళ్ళి టెక్నికల్‌గా కాస్త స్కిల్స్ ఇంప్రూవ్ చేసుకుంటాడనుకున్నాను. ఒక టూ ఇయర్స్ ఉంటే మళ్ళీ ఇండియాకే రమ్మందామనుకున్నాను. కాని, వాడొప్పుకోవట్లేదు. వాళ్ళ ఫ్యూచర్ గురించి వాళ్ళే డిసైడ్ చేసుకోవడం మంచిదని నా అభిప్రాయం.''

అవతలి వ్యక్తి ఏమన్నారో తెలియదు. కాని, మళ్ళీ నాన్నగారు ''ఇప్పుడు ఆలోచించాల్సింది నేను కాదు. నువ్వే. మీ అమ్మాయి ఇక్కడే ఉండదలుచుకుంటే పెళ్ళి చేయడానికి మాకేమీ అభ్యంతరం లేదు. తొందరేం లేదుకదా. లీజర్‌గా ఆలోచించి చెప్పు.'' అంటూ ఫోన్ పెట్టేసాడు.

నాకు ఆ నిమిషంలో నాన్నగారే నయమనిపించింది. హిపోక్రసి లేకుండా తన మనసులో ఉన్నది చెప్పేసారు.

నాన్నగారి దగ్గరికెళ్ళి ''నాన్నా! శేషగిరిరావు అంకుల్ ప్రపోజల్‌ని నేనొప్పుకున్నానని చెప్పండి. కాని, ఇందాక మీరన్నట్టుగా కేవలం రెండు, మూడు సంవత్సరాలు మాత్రమే నేను స్టేట్స్‌లో ఉంటాను. అంతేగాని, అక్కడే సెటిల్ అయ్యే ప్రసక్తేలేదు. ఇక్కడే ఉండి మీతో, అమ్మతో కలిసి ఉంటాం. వాళ్ళమ్మాయి దానికొప్పుకుంటేనే పెళ్ళి చేసుకుంటాను'' అన్నాను.


నాన్నగారు నావైపు ఆశ్చర్యంగా చూసి, ''ఎంట్రా! ఇందాక అసలు వెళ్ళడమే ఇష్టం లేదన్నావు. ఇప్పుడొచ్చి రెండు, మూడు సంవత్సరాల కోసమైతే వెళతానంటున్నావు. సిద్ధార్థునికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయమయినట్లు నీకు కూడా బయట ఎక్కడో కూర్చుంటే జ్ఞానోదయమయినట్టుందే'' అంటూ గట్టిగా నవ్వారు.

''అంత గొప్పవాళ్ళతో మనకు పోలికలెందుకులెండి'' అంటూ నా రూంలోకి వెళ్ళిపోయాను.

కాని, మనసులో 'ఔను, ఇవాళ నాకు నిజంగానే జ్ఞానోదయమయింది' అనుకున్నాను.

★

## షహీల్‌ఖాన్ అంతరంగం!



నా ఫేసూ,
నా టఫ్ ఫిజిక్,
నా సెంటిమెంట్స్,
నా ఎమోషన్స్ అన్నీ చాలా డిఫరెంట్‌గా వుంటాయి.
నా బెడ్‌రూమ్ లోకి ఎవర్నీ ఎలవ్ చేయను.
నాలో వున్న కాన్ఫిడెన్స్ అంటేనే నాకిష్టం.
నా మెర్సిడెస్ బెంజ్‌లో తిరగడం ఇష్టం.
నా గాళ్‌ఫ్రెండ్స్ నాకున్నారు...
అంటూ చెప్పాడండీ షహీల్‌ఖాన్.
సో, వెరీ ఇంటెలిజెంట్‌లా కనిపిస్తున్నాడే!

- ప్రియ

